హోమ్ నర్సింగ్ కోర్సులో ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో మహిళలకు హోమ్ నర్సింగ్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్వర్ణ భారత్ ట్రస్టు, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఏర్పాటు చేశామని వారు పేర్కొన్నారు. జూన్ 3 నుంచి కోర్సు ప్రారంభం అవుతుందని తెలిపారు. 13 రోజుల కోర్సుకు ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామని వెల్లడించారు. 19 నుంచి 45 ఏళ్ల వయస్సున్న ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీజేఎఫ్ నేతలు

శంషాబాద్: నగరంలోని జలవిహార్‌లో ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్న తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రజతోత్సవాలకు సంబంధించి రూపొందించిన పోస్టర్‌ను శంషాబాద్‌లో టీజేఎఫ్ నాయకులు గురువారం ఆవిష్కరించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రజతోత్సవ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో టీజేఎఫ్ పాత్ర ఎనలేనిదని టీజేఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్‌సాగర్ అన్నారు. రజతోత్సవ వేడులకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు. వేడుకలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీజేఎఫ్ నాయకులు పి. వెంకటేష్, డి.కృష్ణ, వెంకటయ్య, మహమూద్, అంజిలప్ప, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరు పత్రాల అందజేత

శంషాబాద్: మున్సిపాలిటీ పరిధిలో ఎంపికైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ గురువారం ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. మున్సిపాలిటీలో మొత్తం 520 మంది ఇందిరమ్మ గృహాలకు లబ్ధిదారులుగా గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వ సూచించిన నిబంధనల మేరకు ఇళ్లు నిర్మాణం చేసుకోడానికి విడతల వారీగా ఆర్థిక సాయం అందుతుందన్నారు. పేద ప్రజలందరికీ సొంత ఇంటిని కలను నిజం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. సుమన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో భారీ వర్షం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి తేలికపాటి వర్షం కురిసింది. ఒక సారిగా భారీ వర్షం ప్రారంభం కావడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఉప్పర్‌పల్లి, ఆరాంఘర్, శివరాంపల్లి, రాజేంద్రనగర్ ఎన్‌ఐఆర్‌డీ రోడ్డు, బుద్వేల్ రోడ్డుపై వరదనీరు నిలిచిపోయింది. వర్షం కారణంగా వ్యాపారాలు లేక చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

చార్మినార్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మహిళా భద్రతా విభాగం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ లావణ్య నాయక్ పేర్కొన్నారు. పాతబస్తీలోని డాన్ హైస్కూల్‌లో మలక్‌పేట్, పురానీహవేలీ బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు ఎస్ఎస్‌సీలో ఉత్తమ ఫలితాలు సాధించగా వారికి గురువారం జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడితేనే అనుకున్నది సాధించవచ్చన్నారు. విద్యావేత్త హబీబ్ సల్మానీ మాట్లాడుతూ.. డాక్టర్ లావణ్య పోలీసు అధికారిగా చాలా మంది జీవితాలపై సానుకూల ప్రభావం చూపించారన్నారు. విద్యావేత్త ముహమ్మద్ అబ్దుల్ వాజిద్ ఫత్తాహ్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. డాన్ విద్యా సంస్థల చైర్మన్ ఫజల్ ఉర్ రెహమాన్ ఖుర్రమ్ మాట్లాడుతూ పిల్లల కోసం సమయం కేటాయించి, వారిని ప్రేరేపించి, ప్రోత్సహించినందుకు డాక్టర్ లావణ్యకు కృతజ్ఞతలు తెలిపారు. డాన్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఆరిఫా, షజియుల్లా ఫిరాసత్, డాక్టర్ సుశేన్, ఇర్ఫాన్ ఖురేషి పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టాలి

వెంగళరావునగర్: ప్రతి వర్షపు చినుకునూ ఒడిసి పట్టి భూగర్భంలోకి పంపాలని.. ఆదిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. వెంగళరావునగర్ కాలనీ పార్కు సమీపంలో ఆయన ఇంకుడు గుంతలను పునరుద్ధరించారు. కాలనీలో ఉన్న యువత సహకారంతో సొంత ఖర్చులతో కాలనీలోని ప్రతి ఇంకుడు గుంతను తిరిగి ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు. నీరు ఉంటేనే మానవునికి మనుగడ ఉంటుందనేది మరచిపోకూడదని చెప్పారు. హైకోర్టు న్యాయవాది లక్ష్మీకాంతరావు, ప్రొఫెసర్ టి.వి.రెడ్డి, సాయి, నాగరాజు, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీకి సర్వం సిద్ధం

ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీ

- ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- హర్షం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు
- ఎంతో ప్రయోజనం అంటూ అభినందనలు
- ఇబ్బందులు లేకుండా చర్యలు: ఏఎస్‌వో పుల్లయ్య



హైదర్‌గూడ జనప్రియ వద్ద ఓ రేషన్ దుకాణం

అత్తాపూర్: రేషన్ దుకాణాల్లో జూన్ ఒకటో తేదీ నుంచి నుంచి ఒకేసారి మూడు నెలల రేషన్‌ను కార్డు దారులకు అందజేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లను పూర్తి చేసింది. రేషనింగ్ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో రేషన్ షాపులకు కొంత మేర బియ్యం స్టాకు కూడా వచ్చింది. మరికొంత గోదాము నుంచి త్వరలో తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. రేషన్ షాపుల్లో కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేయనుండటంతో ఆ బియ్యం తీసుకునేందుకు ప్రజలు పెద్ద ఎత్తున రేషన్ దుకాణాలకు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో రేషన్ బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని రేషనింగ్ రాజేంద్రనగర్ అసిస్టెంట్ సివిల్ సప్‌లై ఆఫీసర్ (ఏఎస్‌వో) పుల్లయ్య తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచన మేరకు జూన్, జూలై, ఆగస్టు మూడు నెలల బియ్యం జూన్ మొదటి వారంలోనే రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ అందేలా ఏర్పాట్లు చేశామని ఆయన వివరించారు.

◆ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్‌లో 61,627 మంది రేషన్ కార్డుదారులు ఉన్నారని ఏఎస్‌వో తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో 60 సివిల్ సప్‌లై దుకాణాలు ఉన్నాయన్నాయన్నారు. గోదాములో ఉన్న బియ్యం ఇప్పటికే 40 శాతం స్థానికంగా ఉన్న రేషన్ షాపులకు చేరిపోయాయని వివరించారు.

అంత్యోదయ కార్డులు 1292

అంత్యోదయ కార్డులకు ప్రతి నెల 35 కిలోల బియ్యాన్ని అందిస్తున్నామని ఏఎస్‌వో పుల్లయ్య పేర్కొన్నారు. జూన్, జులై, ఆగస్టు నెలల్లో కలుపుకొని ఒక్కో కార్డుకు 105 కిలోల బియ్యాన్ని సరఫరా చేస్తామన్నారు. సివిల్ సప్‌లై ద్వారా సరఫరా అవుతున్న రేషన్ బియ్యం మనలో ఇమ్యూనిటీని పెంచే విధంగా తయారు చేసి ఇస్తున్నట్లు తెలిపారు. కరోనా లాంటి వ్యాధులు ప్రబలకుండా విటమిన్ ఏ, బి, ఐరన్ మానవ శరీరానికి అవసరమయ్యే విటమిన్లను మిశ్రమం చేసి వినియోగదారులకు సరఫరా చేస్తున్నామని ఆయన వెల్లడించారు. కోట్లాది రూపాయలు వెచ్చించి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం సివిల్ సప్‌లై ద్వారా రేషన్ బియ్యాన్ని ఉచితంగా అందించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కృతజ్ఞతాపూర్వకంగా ప్రతి ఒక్కరూ ఇంటి అవసరాలకు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సంతోషకరం



మూడు నెలల రేషన్ ఒకేసారి ఇవ్వడం అనేది చాలా సంతోషించదగ్గ విషయం. ఎందుకంటే పనులు మానుకొని ఇక్కడ లైన్‌లో నిలబడటం ఇబ్బందికరంగా ఉంటుంది. రేషన్‌కు వచ్చిన నాడు మా రోజువారీ కూలీ వదులకోవలసి వస్తుంది. అన్నం పరబ్రహ్మ స్వరూపం కేంద్ర ప్రభుత్వం బీద ప్రజలను దృష్టిలో పెట్టుకొని కడుపు నింపుతుంటే ఆ బియ్యాన్ని అమ్ముకోవడం కన్నా మించిన పాపం మరొకటి లేదు. కరోనా సమయంలో దిక్కు లేని పరిస్థితిలో ఇచ్చిన రేషన్, ఐదు వందల రూపాయలు కట్టెకాలే వరకు మరువలేనిది.

– మంజుల, హైదర్‌గూడ

ఎంతో మేలు



ప్రభుత్వ నిర్ణయం ప్రజలకు ఎంతో మేలు చేసే విధంగా ఉంది. వర్షాకాలం, వరదల కారణంగా రేషన్ బియ్యం సరఫరాలో అంతరాయం రాకుండా ఉండటానికి ఈ నిర్ణయం తీసుకున్నారు. వర్షాలు, వరదలు వస్తే బియ్యం రవాణాలో ఇబ్బందులు తలెత్తుతాయి. మూడు నెలల బియ్యం ఒకేసారి ఇవ్వడం వల్ల ఈ ఇబ్బందులు ఉండవు.

– రాచూరి రాజశేఖర్, హైదర్‌గూడ

కార్డుదారులందరికీ బియ్యం

జూన్ నుంచి వినియోగదారులకు ఒకేసారి మూడు నెలల బియ్యాన్ని అందిస్తాం. మా షాపునకు కేటాయించిన 150 క్వింటాళ్ల బియ్యానికి గాను 450 క్వింటాళ్ల బియ్యం సివిల్ సప్‌లైద్వారా అందుతున్నాయి. ఇప్పటికే 200 క్వింటాళ్ల బియ్యాన్ని గోదాం నుంచి సమకూర్చుకున్నాం. ఇంకా రావాల్సిన 250 క్వింటాళ్ల బియ్యం జూన్ 1 నాటికి సమకూర్చుకుని రేషన్ కార్డుదారులు అందరికీ ఉచితంగా బియ్యం అందిస్తాం.

– సోమారం రవీందర్, రేషన్ డీలర్, హైదర్‌గూడ

పాఠశాలల్లో పుస్తకాల జాతర షురూ!



ఓ పాఠశాలలో విక్రయానికి సిద్ధంగా ఉన్న పుస్తకాలు

శాస్త్రిపురం: పాఠశాలలు తెరిచే సమయం వచ్చేసింది. వేసవి సెలవులు ముగుస్తుండటం... మరో 10 రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభం కానుడటంతో దీంతో తల్లితండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఇప్పటికే మొదటి టర్మ్ ఫీజులు చెల్లించాలని కార్పొరేట్ పాఠశాలు చెబుతుండగా మరో వైపు పుస్తకాల పేరుతో వ్యాపారం ప్రారంభమైంది. ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్‌లలో ఏటా పెరిగిన ఫీజులు, బ్యాగు, పుస్తకాలు, యూనిఫాం, టై, బెల్టు, బూట్లు వంటి ధరలు చూసి మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రభుత్వ బడులలో చదివించాలంటే సౌకర్యాలు ఉండవని, ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తే ఫీజుల కారణంగా ఇబ్బంది తప్పడం లేదంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ప్రైవేటు పాఠశాల్లో పుస్తకాల వ్యాపారం బాగానే సాగుతోంది. పుస్తకాలతోపాటు విద్యార్థులకు అవసరమైనా సామగ్రిని వేలాది రూపాయలకు విక్రయిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభమైతే ఒక్కో విద్యార్థికి ఫీజు కాకుండానే పుస్తకాలు, ఇతర వస్తువులకు రూ. 5 వేలకు పైగానే అదనంగా ఖర్చవుతోంది. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన వస్తువుల వ్యాపారం నియంత్రించాలని, అందరికీ అందుబాటు ధరల్లో ఉండేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

సావర్కర్‌కు ఘనంగా నివాళి



మణికొండ: హిందుత్వ వాదంతో పాటు స్వాతంత్రం కోసం తన జీవితాన్ని అర్పించిన పోరాట యోధుడు వినాయక్ దామోదర్ సావర్కర్ జయంతిని నిర్వహించారు. బుధవారం రాత్రి మణికొండలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. మర్రిచెట్టు కూడలిలోని భారత మాత విగ్రహం వద్ద రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ్ సభ్యులు మాట్లాడుతూ... స్వాతంత్ర సంగ్రామ చరిత్రను మరుగున పడకుండా తన రచనల ద్వారా ప్రజలను ఉత్తేజ పరిచిన చరిత్రకారుడు సావర్కర్ అన్నారు. ఆయన లాంటి మహా దేశభక్తులను స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ బీజేపీ నాయకులు, ఆర్ఎస్ఎస్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం



కమిటీ చైర్మన్ కె.చంటిబాబును సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్కొండ కోట జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు అన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులను గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేశ్ తన కార్యాలయంలో గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా చంటిబాబు మాట్లాడుతూ.. దేవాదాయ శాఖ అధికారుల సలహాలు, సూచనల పాటిస్తూ బోనాలు నిర్వహిస్తామన్నారు. అమ్మవారికి జరిగే తొమ్మిది పూజలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారని వారికి ఇబ్బందుల్లేకుండా వివిధ శాఖల అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తామన్నారు. లంగర్‌హౌస్ నుంచి మొదటి బోనం ఊరేగింపు ప్రారంభమవుతుందని రాష్ట్ర మంత్రులు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి గోల్కొండ కోట వరకు జరిగే ఊరేగింపు రాష్ట్ర సాంస్కృతిక శాఖ వారి రథాలు, పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కె.చంద్రశేఖర్, సభ్యులు ముంగి రఘుపాల్‌రెడ్డి, బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు నాగలపల్లి శ్రీకాంత్, సంతోష్‌గౌడ్, అనిత, ప్రదీప్‌కుమార్, ఎస్.జోగి యాదగిరి తదితరులు ఉన్నారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరిపై కేసు

వెంగళరావునగర్: గంజాయిని సేవిస్తున్న ఇద్దరిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... కార్మికనగర్‌కు చెందిన సతీష్, సోహెయిల్‌లు గురువారం యూసుఫ్‌గూడ బస్తీ సమీపంలో గంజాయి సేవిస్తున్నారు. స్థానికులు ఈ విషయాన్ని మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ బాల్‌రాజ్ సిబ్బందితో వచ్చి వారిని ప్రశ్నించగా, గంజాయి తాగుతున్నట్టుగా అంగీకరించారు. దాంతో పోలీసులు సతీష్, సోహెయిల్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓఆర్ఆర్‌పై కంటైనర్ బోల్తా

శంషాబాద్: డ్రైవర్ నిర్లక్ష్యంతో కంటైనర్ బోల్తా పడిన సంఘటన ఓఆర్ఆర్‌పై చోటు చేసుకుంది. ఆర్‌జీఐఏ ఎస్ఐ శ్రీధర్‌సమాచారం మేరకు... గురువారం తెల్లవారు జామున శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్తున్న ఎఫ్ఆర్ లాజిస్టిక్‌కు చెందిన ఓ కంటైనర్ ఓఆర్ఆర్‌పై రాళ్లగూడ సమీపంలో డ్రైవర్ అజాగ్రత్త వల్ల బోల్తా పడింది. ఇందులో డ్రైవర్ హసీ నజర్‌తో పాటు క్లీనర్‌కు గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్‌జీఐఏ ఎస్ఐ తెలిపారు.

బండి ప్రతాప్‌రెడ్డికి నివాళి

రాజేంద్రనగర్: బీజేపీ రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకుడు బండి ప్రతాప్‌రెడ్డి వర్ధంతిని గురువారం రాజేంద్రనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను పార్టీ బలోపేతం కోసం చేసిన కృషిని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో బండి ప్రతాప్ రెడ్డి సోదరి వీరమ్మ, కూతురు ఝాన్సీరెడ్డి, నేతలు ఉమా రెడ్డి, ఆదిత్య రెడ్డి, అరవింద్ రెడ్డి, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెహిదీపట్నం నుంచి బెంగళూర్‌కు ఏసీ బస్సు

గోల్కొండ: మెహిదీపట్నం పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం మెహిదీపట్నం పిల్లర్ నంబర్ 60 నుంచి బెంగళూర్‌కు ఏసీ బస్సు నడపనున్నట్లు మెహిదీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ బి.వి.కె.మూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మియాపూర్–1 డిపోకు చెందిన లహరీ ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సు మియాపూర్ నుంచి కేపీహెచ్‌బీ, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట్ మీదుగా మెహిదీపట్నం పిల్లర్ నంబర్ 60 వద్దకు చేరుకుంటుందని పేర్కొన్నారు. రాత్రి 8.30కు ఇక్కడి నుంచి బయలుదేరి శంషాబాద్ మీదుగా బెంగళూరులోని మార్తిహాలీ వరకు వెళ్తుందని పేర్కొన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నిషేధిత వేళల్లో రెడీమిక్స్ వాహనాల రాకపోకలు

బంజారాహిల్స్: రద్దీ సమయాల్లో రెడీమిక్స్ వాహన రాకపోకలకు నిషేధం విధిస్తూ నో ఎంట్రీ సమయాలను కేటాయించారు. కొన్ని రెడీమిక్స్ వాహనాలు ఇష్టానుసారంగా నిబంధనలు ఉల్లంఘించి తిరుగుతున్నట్లుగా గుర్తించిన జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు వారిపై చర్యలు తీసుకోవాలంటూ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలివీ... జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–45లో ట్రాఫిక్ ఎస్ఐ సత్య నరేంద్ర తనిఖీలు నిర్వహిస్తుండగా నిషేధిత వేళల్లో రెండు రెడీమిక్స్ వాహనాలు రావడం గుర్తించారు. ఆ రెండు వాహన యజమానులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెండు రెడీమిక్స్ వాహనాలను సీజ్ చేశారు.

ఎర్రకుంటలోకి వర్షపు నీరు వెళ్లేలా చర్యలు



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: వర్షపు నీరు ఎర్రకుంట చెరువులోకి వెళ్లేలా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేస్తామనిని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం హైదర్షాకోట్ శాంతినగర్ రోడ్డు నిర్మాణ పనులు, స్పీడ్ బ్రేకర్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డుపై వృథాగా వర్షపు నీరు వెళ్లకుండా నీటిని ఎర్రకుంట చెరువులోకి నీరు చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సంవత్సరం వర్షపు నీటితో ఎర్రకుంట నిండుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పనులకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్రలు సహకరించారన్నారు. కార్యక్రమంలో 16వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పుష్ప శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ యువ నాయకుడు టింకురెడ్డి, మాజీ ఎంపీటీసీ సంతోష్‌ముదిరాజ్, లక్ష్మీనగర్ కాలనీ ప్రెసిడెంట్ రవికాంత్‌రెడ్డి, భాగ్యనగర్ కాలనీ ప్రెసిడెంట్ పి.ఎస్.గోపాలాచారి, సెక్రటరీ విశ్వనాథం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లకు తగ్గిన డిమాండ్



రాజేంద్రనగర్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో గడచిన ఐదారు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎండలు తగ్గి.. ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. వర్షాల ప్రభావంతో భూగర్భ నీటి మట్టాలు పెరుగుతున్నాయి. దీంతో నిన్న మొన్నటి వరకు ఎండిన బోర్లు రీచార్జి అవుతున్నాయి. దీని కారణంగా జలమండలి ఆధ్వర్యంలో విక్రయిస్తున్న మంచినీటి ట్యాంకర్ల డిమాండ్ తగ్గింది. రాజేంద్రనగర్ సర్కిల్ జలమండలి పరిధిలో మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లు కొనసాగుతున్నాయి. ఈ సర్కిల్ పరిధిలోని బుద్వేల్, మైలార్‌దేవ్‌పల్లి జలమండలి వాటర్ ఫిల్లర్ల ద్వారా మంచినీటి ట్యాంకర్లను సరఫరా చేస్తున్నారు. వేసవి నేపథ్యంలో స్థానికంగా భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో ట్యాంకర్లకు విపరీతమైన గిరాకీ పెరిగింది. రోజూ సర్కిల్ పరిధిలో 500లకు పైగా ట్యాంకర్ల కోసం వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా తమ వాటర్ క్యాన్ నంబర్లతో బుక్ చేసుకునేవారు. ప్రతిరోజు వీరికి నీటిని సరఫరా చేసేందుకు ట్యాంకర్ల ద్వారా అధికారులు సరఫరాను నిర్వహించేవారు. టోకన్ నంబర్ ఆధారంగా ఈ ప్రక్రియ సాగింది. రద్దీ కారణంగా రెండు రోజులకు పైగా సమయం పట్టేది. గత ఆరు రోజులుగా కురుస్తున్న వర్షాలకు భూగర్భ జలాల నీటి మట్టం పెరిగింది. ఎండిన బోర్లు సైతం రీచార్జి అవుతున్నాయి. దీంతో మంచినీటి ట్యాంకర్ల వినియోగం తగ్గింది. గతంలో ప్రతిరోజు 500లకు పైగా ట్యాంకర్ల సరఫరా ఉండగా... ప్రస్తుతం 300లకు చేరింది. ఇలాగే వర్షాలు కురిస్తే మరింత తగ్గనుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వేడుకగా ధ్వజారోహణ పూజలు



పూజలు చేసిన వేద పండితులు

మణికొండ: మంచిరేవుల శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు గురువారం ఉదయం వేదమంత్రోచ్చరణల మధ్య ధ్వజారోహణం, బలిహరణం తదితర ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం హారతి, ప్రసాద గోష్టిలను నిర్వహించారు. సాయంత్రం భేరి పూజ, దేవతాహ్వానం, హనుమంత వాహన సేవలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణలు చేసి పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో శుక్రవారం ఉదయం 9 గంటలకు స్వామి వారికి అష్టోత్తర శతకలశాభిషేకం, సాయంత్రం గరుడవాహన సేవ, ఎదుర్కోలు, రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణం ఉంటుందని ఆలయ వేద పండితులు తెలిపారు. పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమస్యలు తెలుసుకునేందుకే పర్యటనలు

బీఆర్ఎస్ మైలార్‌దేవ్‌పల్లి అధ్యక్షుడు వెంకటేష్



బాబుల్‌రెడ్డినగర్‌లో పర్యటిస్తున్న మైలార్‌దేవ్‌పల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు రోజూ పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. బాబుల్‌రెడ్డినగర్‌లో బీఆర్ఎస్ నాయకులు పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాబుల్‌రెడ్డినగర్‌లో మూతలు లేని మ్యాన్‌హోల్స్ కారణంగా ప్రజలు ప్రమాదాలబారిన పడుతున్నారన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచె లేకుండా ఉంటున్నాయన్నారు. అలాగే కరెంటు స్తంభాలు పడిపోకుండా తాడుతో కట్టి ఉన్నాయన్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లను ఇతర ప్రాంతాలకు తరలించాలని, పాతకాలం నాటి విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు ప్రణాళిక లేకుండా ఇష్టానుసారంగా అడ్డదిడ్డంగా రోడ్లను వేశారన్నారు. ఆ రోడ్లు దేనికి ఉపయోగకరంగా లేకుండా మారాయన్నారు. ఆరు మాసాల క్రితం తవ్విన మట్టి కుప్పలను తొలగించకపోవడంతో అవి రోడ్ల మధ్యనే ఉండిపోయి వాహనాదారులకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయన్నారు. ఇప్పటికైనా నాసిరకం పనులు చేస్తున్న, మొండికేసిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలన్నారు. యూత్ అధ్యక్షుడు రాఘవేందర్‌యాదవ్, సోమ శ్రీనివాస్ గుప్తా, మైసిరెడ్డి, ఎడ్లకాడి సూర్యం, చిరంజీవి, జి.రాజు, హనుమంతు, కార్తీక్, వెంకటరమణ, ఉప్పల్ శ్రీను, అశోక్‌కుమార్, భూదేవి, సరితా, మహేష్, అరుణ్‌రెడ్డి, కిషోర్, సందీప్, సునీల్, రాజ్‌కుమార్, రవి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టండి



అలకాపూర్ టౌన్‌షిప్‌లో వాల్వ్ నుంచి వృథాగా పోతున్న నీరు

మణికొండ: గండిపేట నుంచి నగరానికి వెళ్తున్న క్యాండూట్ వాల్వ్‌ల నుంచి రోజూ లక్షల లీటర్ల నీరు వృథాగా అవుతోంది. ఈ విషయంపై సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి లీకేజీలు ఏర్పడిన చోట వెంటనే మరమ్మతులు చేపట్టి వృథాను అరికట్టాల్సిన అధికారులు ఆ పని మాది కాదు అన్నట్టు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 16వ వద్ద వాల్వ్ లీకేజీ అని నీరంతా వృథాగా పోతుందన్నారు. అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లినా పట్టించుకోవటం లేదని వారు వాపోయారు. ఇకనైనా జలమండలి అధికారులు స్పందించి నీటి లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం



ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 14 రకాల ధాన్యాలకు మద్దతు ధర ప్రకటించడంపై బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు మాణిక్ ప్రభు ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్‌లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి గురువారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దేవర శ్రీనివాస్ మాట్లాడుతూ..వరి, జొన్న, పత్తి ఎక్కువగా పండే మన రాష్ట్రంలో వేలాది మంది రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణగుప్తా, గోదా లక్ష్మీకాంత్‌యాదవ్, సునీల్‌బోలే, ఆకుల శ్రీకాంత్, వెంకటేశ్ సాగర్ తదితరులు ఉన్నారు.